వ్యాసము:

మన చిత్రకారుడు 6

# కథాచిత్రకారుడు

# చంద్ర

హరినారాయణ్.




‘‘పత్రికలకు బొమ్మలుచేసి డబ్బు సంపాదించేవారు, కాన్వాసు మీద వర్ణ చిత్రాలు తయారుచేసే వారు—రెండురకాల వారి గురించి ఈ శీర్షిక క్రింద వ్రాయడం సబబుగాలేదు’’ అని కొంతమంది నాతో ఈ మధ్య అన్నారు. నేను వ్రాసిన వ్యాసాలు చదివి సహృదయతతో వారు వెలిబుచ్చిన అభిప్రాయాలకు




కృతజ్ఞత తెలుపుకొంటున్నాను. సహేతుకమైన విమర్శలవలన ఎంతో లాభం కలుగుతుందని నా దృఢ విశ్వాసం. కనుక ఇకముందు కూడా పాఠకులు తమ తమ నిష్పాక్షికమైన అభిప్రాయాలను తెలియ పరచి నా ప్రయత్నాన్ని మరింత సఫలీకృతము చేస్తారని ఆశిస్తున్నాను.

పోతే పత్రికలకు, పుస్తకాలకు చిత్రాలు వేసే వారిని ''వ్యాపార చిత్ర కారులు'' అని పేరు పెట్టినంత మాత్రాన చిత్రకారుల జాబితానుండి వారిని కొట్టివేయవలసిన అవసరం నాకు కన్పించడం లేదు. ''శుద్ధ చిత్రకారులు'' ఈ నాడు సామాన్య ప్రజానీకంలో మంచి కంటె చెడుపేరు సంపాదించుకొన్నారు. కారణం ఏదైనా ఇది మాత్రము నిజం. 'ప్యూర్ ఆర్టిస్ట్'లలో కూడా అడ్డ త్రోవలు తొక్కేవారు ఎక్కువ మంది ఉన్నారు. చిత్రకళ పేరుతో సాగుతున్న వ్యాపారం ఎంతైనా గర్హనీయం.

అంతమాత్రాన అందరినీ కించపరచుట నా ఉద్దేశ్యం కాదు. తమ అభిప్రాయాలను, భావాలను, సంకేతాలను, వర్ణసమ్మేళనాలను ప్రజానీకానికి తెలియ చెప్పలేని అయోమయస్థితిలో నేటి చిత్రకారులు చిక్కుకొని ఉన్నారు. చిత్రాలు గీసే చిత్రకారులు ఇతరులకు నచ్చ చెప్పడానికి ఇష్టపడరు. ప్రజలకు అర్థం




కావడం లేదు. ఇటు వంటిస్థితిలో మధ్యవర్తుల అవసరం చాలా ఉంది. విమర్శకులు ఇందుకు ముఖ్యంగా దోహదం చేస్తారు. అలాంటివారు కూడా అతితక్కువ సంఖ్యలో ఉన్నారు

నేటి ప్రజాయుగంలో "ప్యూర్ ఆర్టిస్ట్"లకు, "సామాన్య ప్రజలకు" మధ్య వంతెనవలె వ్యవహరించేవారు వ్యాపార చిత్రకారులు. అతిక్లిష్టమైన ప్రయోగాలను, సంకేతాలను అధ్యయనంచేసి, వాటి సారాన్ని గ్రహించి 'సామాన్యునికి' చెప్పగల అవకాశము ఈ చిత్రకారులకు ఉండి. మెల్లమెల్లగా చిత్రకళలో అభిరుచి పుట్టింపచేయ గలరు. కనుక వ్యాపారచిత్ర కారులను త్రోసి వేయుట చిత్రకళాభి వృద్ధికి గొడ్డలి పెట్టు అని నా అభిప్రాయం.

* * * *

లోగడ వ్యాసాలలో వ్రాసినట్లు నేటి యువచిత్రకారులపై 'బాపు' ప్రభావం ఎక్కువగా ఉన్నది. కొంతమంది బాపు బొమ్మలను జాగ్రత్తగా పోగుచేసి రికార్డు చేసుకొన్నారు. ఇలాంటివారు నాకు తెలిసిన వారు చాలామంది ఉన్నారు. మరికొంతమంది బాపు చిత్రాలకు కాపీలు స్వయంగా తయారు చేసుకొని పెట్టు




కొన్నారు. కొన్ని చిత్రాలను కాపీ చేసిన తర్వాత స్వయంగా చిత్రాన్ని చేయగలే శక్తి కొంతవరకు వస్తుంది. సహజమైన ప్రతిభకలవారు ఎంతో వేగంగా, దృఢంగా ముందుకు సాగుతారు. అందరికీ అందుబాటులో ఉండే చిత్రకళా శాలలు లేకపోవడం మన దౌర్భాగ్యం. చిత్రకళాభిరుచి కలవారు ఎన్నో శ్రమల కోర్చి ప్రాథమిక విషయాలను నేర్చుకొన గల్గుతున్నారు. ఏకలవ్యుడు వీరందరికీ ఆదర్శ పురుషుడు.

ఇటువంటి వారికి చెందిన చిత్రకారుడు 'చంద్ర', ప్రారంభంలో మరెన్నో కలంపేర్లు పెట్టుకొన్నా, చివరికి 'చంద్ర' స్థిరపడిపోయింది. నిజం చెప్పాలంటే వీరు గీసిన చిత్రాలు చాలా తక్కువ. కాని అతితక్కువ చిత్రాలతో ఎక్కువ మందిని ఆకర్షించ గలిగారు. అనతి కాలంలో తెలుగు పత్రికా రంగంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని 'చంద్ర' సంపాదించుకో గలరని నా గట్టి నమ్మకం. తగిన ప్రోత్సాహం లభిస్తే చాలు.

పూర్తిపేరు మైదం చంద్రశేఖర్. ఆగస్టు ఇరవై అయిదవ తారీకున 1946వ సంవత్సరములో వరంగల్లులో జన్మించారు. 1955 నుండి హైదరాబాదు




లోని సుల్తాన్ బజారు స్కూలులో చదివారు. మెట్రిక్ వరకు అక్కడే చదివి, ఆ తర్వాత పి. యు. సి. కొరకు సైఫాబాదు సైన్సు కాలేజిలో చేరారు. కాని పూర్తిచేయలేదు.

హైస్కూలులో చదువుతున్నపుడు ఒకరోజు కె. శేషగిరిరావు, యమ్. యస్. దాతార్ గార్లను (ఫైన్ ఆర్ట్స్ కాలేజి) స్కూలుకు పిలిచారు. 'చంద్ర' చిత్రించిన రెండు మ్యూరల్స్‌ను చూసి శ్రీ దాతార్ సంతోషం పట్టలేక జేబులో ఉన్న పర్సుతీసి ఇచ్చివేశారు. అందులో ఉన్న 52 రూపాయలు పెట్టి - ప్రధానోపాధ్యాయుని సలహాపై-రంగులుకొని, చిత్రకళాభ్యాసం మరింత ఉత్సాహంతో సాగించారు.

1959లో పత్రికలో వీరి కార్టూన్‌లు అచ్చయినవి. అపుడు చాలా సంతోషం కల్గింది. 1961 లో ఆంధ్రప్రభలో కథ అచ్చయింది. ఆరు, ఏడు తరగతులలో చదువుతున్నపుడు శంకర్స్ వీక్లీ పోటీలలో పాల్గొనడం జరిగింది. ఒకసారి మూడవ బహుమతి, మరి రెండుసార్లు మామూలు అవార్డులు లభించినవి.



1964లో 'గడిపూలు' అన్న పుస్తకానికి ప్రప్రథమంగా ఆవరణను రూపకల్పన చేశారు. అదే సంవత్సరం గోపీచంద్ కుమారుడు రమేష్ బాబు ప్రారంభించిన 'జోత్స్న' మాసపత్రికకు కవరుపేజీ, కథా చిత్రాలు చిత్రించారు. కారణాంతరాల వలన ఆ పత్రిక ఎక్కువ రోజులు నిలవలేదు.

తర్వాత 'యువ'లో చిత్రాలు వేశారు. హిందీ పత్రికలలోని చిత్రాలు వీరిని అమితంగా ఆకర్షించేవి.

1963 లో ఆర్టు సొసైటీ వారి పోటీలలో పాల్గొన్నారు. లలిత కళాశాలలో పెయింటింగ్ డిప్లొమాకోసం ప్రవేశించారు. మూడు సంవత్సరాలు అక్కడ అధ్యయనం చేశారు. అక్కడి వాతావరణం, పద్ధతి నచ్చలేదు. హాబీ కొరకు వచ్చేవారు ఎక్కువ అని తేలింది. అందువలన డిప్లొమా పూర్తికాకముందే వదిలి వేశారు

తెలంగాణా కవులు నివసించిన ప్రాంగణంలో (కేశవమెమోరియల్ వద్ద) తమ బాల్యం గడుపుట వలన సాహిత్యాభిలాష అభివృద్ధి చెందింది.

ఇప్పటికి సుమారు 100 పుస్తకాలకు ఆవరణలు తయారు చేశారు.

'జ్యోతి'లో ఆరునెలలపాటు పనిచేశారు. ప్రస్తుతం 'యువ'లో పని చేస్తున్నారు. శ్రీ సుధాకరరావు, శ్రీ రమేష్‌బాబు, శ్రీ రాఘవయ్య గార్ల ప్రోత్సాహం 'చంద్ర'లో కొత్త ఆవేశాన్ని పూరించింది.

కాన్వాసు మీద ఇంతవరకు పెయింట్ చేయలేదు కాని, ఆధునిక చిత్ర కళలో distortion (వైరూప్య చిత్రకళ) అంటే చాలా ఇష్టం. వీరు చూపించిన స్కెచ్ బుక్స్‌లో చాలా ముడిసరుకు ఉన్నది. రాబోయే సంవత్సరాలలో తమలోని భావాలను, కోరికలను వర్ణసమ్మేళనాల ద్వారా చిత్రకళాభిమానులకు అందచేస్తానని చెప్పారు. స్కెచ్‌లు చూసిన తర్వాత నాకు నమ్మకం కుదిరింది.

అటు వ్యాపార చిత్రకళలో కూడా ఎక్కువ 'వాల్యూమ్' చేయలేదు కాని చేసినంత వరకు ఉన్నత శ్రేణికి చెందిన పనితనాన్ని చూపారు.

యువతరానికి సహజమైన విప్లవ భావాలు వీరిలో చెలరేగిన కారణంగా సమాజాన్ని ఎదిరించి వర్ణాంతర వివాహాన్ని చేసుకొన్నారు. ఒక మగపిల్లవాడు ఉన్నాడు.

కథా చిత్రాలు గీయడంలో వీరు చాలా సహజమైన సంఘటనలను తీసుకొని, అతిక్లిష్టమైన భంగిమలలో అత్యంత సుందరంగా చిత్రిస్తారు. వీరి చిత్రాలలోని రూపాలు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి, వీరి చిత్రాలలోని అందాలు వీరికి పేరు సంపాదించ గలవనుటలో సందేహములేదు.

ప్రశ్న :- గీయబోయే చిత్రాన్ని ఎలా ఎన్నుకొంటారు ?

జ :- కథసాంతము చదివి, ముఖ్యమైన సన్నివేశాన్ని, లేక చిత్రము దృష్ట్యా సరిపోయిన సన్నివేశాన్ని ఎన్నుకుంటాను.

ప్రశ్న :- భంగిమలు (పోజ్) సహజంగా ఎలా ఊహించగల్గుతారు ?

జ :- ప్రతిరోజూ, యదార్ధ జీవితంలో జాగ్రత్తగా అధ్యయనం చేస్తాను. కెమెరావలె దృష్టి పనిచేయాలి. ప్రతి ఆకర్షణీయమైన భంగిమను

మెదడులో ఫొటో ఆల్బమ్‌వలె భద్రపరచుకోవాలి, అవసరమైనపుడు దానిని ఉపయోగించుకోవాలి

ప్రశ్న :- మనుష్యుల రూపాలను ఎలా ఊహిస్తారు ? వాస్తవ జీవితం నుండి గ్రహిస్తారా ?

జ :- లేదు. ఎక్కువ భాగం కల్పననుండి వస్తుంది. కధను చదివితే అందులో చిత్రణను అర్ధంచేసుకొని, వ్యక్తియొక్క లక్షణాలను గ్రహించాలి. వయస్సు, ఆకృతి, అంద చందాలు మొదలగు విషయాలు తెలుసుకొని వాటికి తగ్గట్టు యదార్ధత కల్గిన చిత్రాలను గీయాలి. ఒక్కొక్క సారి కథలో వ్యక్తిరూపము గురించి కాని, గుణము గురించికాని ఏమీ తెలియదు. అటువంటి సమయంలో కొంత కష్టము.

ప్రశ్న :- అర్జంటుగా బొమ్మలు గీయవలసి వస్తే ?

జ :- కథ చదివేసి ఏవో రెండు, మూడు ముఖాలు వేస్తే సరిపోతుంది. వాతావరణం అనవసరం.

ప్రశ్న :- కొన్ని చిత్రాలు వేసిన తరువాత ఒకే మూసలో పోసిన చిత్రాలు తయారవుతాయి. వీటిని మార్చడం ఎలా ?

జ :- అవును, ఒక్కొక్క చిత్రకారుడు ఒక్కొక్క స్టేజిలో ఈ విషయాన్ని తెలుసుకొన గల్గుతాడు. అపుడు వెరైటీకోసం ప్రయత్నిస్తాడు. చూసేవాళ్ళు అలాంటి చిత్రాలకు అలవాటు పడిపోవడం వలన చిత్రాలలో మార్పుచాలా అవసరం.

ప్రశ్న :- మీరు చిత్రాలు గీస్తున్నపుడు ప్రక్కన ఎవరైనా ఉంటే ఎలా ఉంటుంది ?

జ :- చిత్రకారుడికి ఒంటరితనం చాలా హాయిగా ఉంటుంది. ప్రక్కన ఎవరైనా ఉంటే కొంత అసహజత్వం ఆవరిస్తుంది. మరొకవ్యక్తి తన ప్రతి కదలికను గమనిస్తున్నాడని తెలిసి ఉండడం చిత్రకారుని స్వాతంత్ర్యాన్ని అరికట్టి వేస్తుంది. చిత్రాన్ని గీసేటప్పుడు చూసిన ప్రేక్షకుడు నిష్పాక్షికంగా తన అభిప్రాయాన్ని చెప్పలేడు. తాను కూడా అందులో ఒక భాగం అయిపోతాడు

ప్రశ్న :- మీకు కార్టూన్ ఇష్టమా ? కథాచిత్రాలు ఇష్టమా ?

జ :- కథాచిత్రాలలో ఎక్కువ స్కోప్ ఉంటుంది. కార్టూన్‌లో జోక్‌మీద ఉన్న ఆసక్తి చిత్రంమీద ఉండదు. అందువలన కథాచిత్రాలు ఎక్కువ ఇష్టం. కార్టూన్‌లు కూడా, చాలా వేశాను.

ప్రశ్న :- కాన్వాసుమీద గీయబోయే చిత్రాలలో ఎటువంటి విషయాన్ని తీసుకోవాలని ఉంది ?

జ :- ఫిగరేటివ్ ఎక్కువ ఇష్టం. Distortion (వైరూప్య చిత్రకళ) ఎక్కువగానన్ను ఆకర్షించింది. నా స్కెచ్ పుస్తకాలలో సుమారు 40 చిత్రాలకు రూపకల్పన చేశాను. సమయాన్ని బట్టి ఆ చిత్రాలను వేస్తాను.

ప్రశ్న :- పత్రికలలో చిత్రాలకు ముఖ్యమైన అవసరాలు ఏమిటి ?

జ :- 1. స్థలము.-పత్రికలలో ఎంత ఎక్కువ చోటుఇస్తే అంత ఆకర్షణీయంగా చిత్రాన్ని వేయవచ్చును. ఒక దృశ్యాన్ని చిత్రీకరిస్తున్నపుడు కేవలం మనుష్యులనే కాక చుట్టు ప్రక్కల వాతావరణాన్ని చిత్రిస్తే ఎంతో సహజత్వం, ఆకర్షణ పెరుగుతుంది. చిత్రకారుడు తన నేర్పును చూపగలుగుతాడు. మన తెలుగు వారపత్రికలలో రెండు పేజీల నిండా వేసే చిత్రాలు చాలా విశాలముగా ఉంటాయి. అలాంటి చిత్రాలు నాకు చాలా నచ్చుతాయి.

2 కాలము :- తగినంత ముందుగా చిత్రాన్ని పూర్తిచేస్తే చిత్రం బాగా వస్తుంది హడావుడి పనికిరాదు.

3. స్వేచ్ఛ :- వ్యక్తి స్వేచ్ఛ చాలా అవసరము. స్వేచ్ఛ లేనపుడు చిత్రాలు వేసినా మానసికానందం ఉండదు.

ఇవికాక ఆర్థిక ప్రోత్సాహము, పాఠకుల విమర్శలు, లేఖలు చిత్రకారుణ్ణి మరింత ఉసిగొల్పుతాయి.

ప్రశ్న :- చిత్రకళ అభ్యాసం కొరకు మీ సలహా ఏమిటి ?

జ :- హాబీగా కాలం గడపడాని కోసం కాలేజిలో చేరవచ్చును. అలాకాక వృత్తిగా ఎన్నుకొన దలచిన వారు స్వతః శక్తి మీద ఆధారపడడం మంచిది. చిత్రకళ ఒకరి వద్ద నేర్చుకోనక్కరలేదు. తనంతటతాను నేర్చుకొన్నపుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ధైర్యం వస్తుంది.

ప్రశ్న :- మిమ్మల్ని ఆకర్షించిన కొందరు చిత్రకారుల పేర్లు చెప్తారా ?

జ :- కార్టూన్స్‌లో విజయన్. మిక్కీ-పటేల్, ఆర్. కె. లక్ష్మన్ ముఖ్యులు.

ఇల్లస్ట్రేషన్‌లో మేరియో నన్ను ఆకర్షించాడు. అలాగే గంగూలీ, గోవింద్. పటేల్ మొదలగు చిత్రకారులు ముఖ్యులు.

ప్యూర్ ఆర్ట్‌లో రామ్‌కింకర్, జహంగీర్ సాబావాలా, హుస్సేన్ చిత్రాలు నాకు నచ్చాయి.

## జి. రాజేశంగారి పరిచయం

మెదక్ జిల్లా సిద్దిపేటలో 1942 లో జన్మించారు. శ్రీ కె. రాజయ్యగారా వద్ద ప్రారంభిక శిక్షణ పొందారు. 1966లో లలిత కళా సమితి, సిద్దిపేట వారిచే నిర్వహించ బడిన ప్రదర్శనలో మొదటి బహుమతి పొందారు. 1967 లో ఆంధ్ర ప్రదేశ్ లలిత కళా అకాడమీ, హైద్రాబాదు ఆర్ట్ సొసైటీ వారి ప్రదర్శనలలో పాల్గొన్నారు. లలిత కళాసమితి, సిద్దిపేట కార్యవర్గ సభ్యులు. సిద్దిపేట తాలూకా మరపడగలో ప్రస్తుతం ఉపాధ్యాయులుగా నుంటున్నారు.

1968లో ఆంధ్ర ప్రదేశ్ లలితకళా అకాడమీ వారిచే నిర్వహించబడిన చిత్రకళా పోటీలలో, స్వర్ణ బహుమతి పొందారు. బహుమతి నొందిన చిత్రమే ఈ సంచిక ముఖచిత్రం.